ప్రజాశక్తి

శుక్రవారం 24 ఫిబ్రవరి 2023

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

పోరాట యోధురాలు

పార్వతమ్మకు అశ్రు నివాళి

- కన్నుమూసిన విశాఖ ఉద్యమ స్వరం
- కడవరకూ ఎర్రజెండాతోనే పయనం
- సారా వ్యతిరేకోద్యమంలో కీలకపాత్ర
- నేడు తిమ్మరాజుపేటలో అంతిమయాత్ర
- హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు



పార్వతమ్మ పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, తదితరులు



పార్వతమ్మ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అచ్యుతాపురం, విశాఖ కలెక్టరేట్, గ్రేటర్ విశాఖ బ్యూరో

అలుపెరగని పోరాట యోధురాలు, సిపిఎం సీనియర్ నాయకురాలు కర్రి పార్వతమ్మ (84) బుధవారం రాత్రి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట గ్రామంలోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఆమె ఎందరికో ఆదర్శం. తొలితరం విశాఖ ఉద్యమ స్వరం. ప్రజా సమస్య ఎక్కడుంటే అక్కడామె ఉన్నారు. మిగతా 2లో..

నేడు బివి.రాఘవులు, ప్రజా సంఘాల నేతల రాక

శుక్రవారం ఉదయం తిమ్మరాజుపేటలో పార్వతమ్మ అంత్యక్రియలు జరగనున్నాయి. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తదితరులు హాజరుకానున్నారు. స్థానికంగా సభ జరగనుంది.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 44 మంది నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. మొత్తంగా 44 మంది నామినేషన్లు వేశారు. ఈ నెల 16 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. బుధవారం నాటికి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి 18 మంది నామినేషన్లు వేయగా చివరి రోజైన గురువారమే ఏకంగా 26 మంది నామినేషన్లు వేశారు.

నామినేషన్ల ప్రక్రియ తొలి రోజునే పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ సందడిగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. 22న ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు సీతంరాజు సుధాకర్ (వైసిపి), వేపాడ చిరంజీవిరావు (టిడిపి), పివిఎన్.మాధవ్ (బిజెపి) నామినేషన్లు వేశారు.

250 ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ

250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్నారు. రోజు రోజుకూ ఉత్తరాంధ్ర నుంచి ఆమెకు మద్దతు పెరుగుతోంది. అధికారం అండ చూసుకుని వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అనుకూలంగా ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి విశాఖలో ఈ నెల 19న ఓ హోటల్‌లో ప్రైవేటు విద్యాసంస్థలతో నిర్వహించిన సమావేశాన్ని కూడా ప్రజాసంఘాల కార్యకర్తలే బట్టబయలు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజా సమస్యలపై గొంతుకగా డాక్టర్ రమాప్రభ అన్ని తరగతులనూ ఆకట్టుకునే ప్రచారంతో ముందుకెళ్తున్నారు. ఆమె చేస్తోన్న కృషిని ఉత్తరాంధ్రలో అన్ని రంగాలకు చెందిన ప్రజానీకం ముక్తకంఠంతో హర్షిస్తున్నారు.

రైతు బజార్లలో..

జిసిసి చింతపండు అమ్మకం

ప్రజాశక్తి - విశాఖపట్నం : నగరంలోని రైతు బజార్లలో గిరిజన సహకార సంస్థ (జిసిసి) తమ స్టాల్స్‌లో గిరిజన్ పిక్క చింతపండును అమ్మకానికి పెట్టింది. గురువారం ఉదయం సీతమ్మధార రైతు బజార్లోని జిసిసి స్టాల్‌లో చింతపండు అమ్మకాలను జిసిసి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సురేంద్రకుమార్ ప్రారంభించారు. మూడు కేజీల పిక్క చింతపండు ప్యాకెట్‌ను రూ.130కు, ఐదు కేజీల పిక్క చింతపండు ప్యాకెట్‌ను రూ.215కు జిసిసి అమ్ముతోంది. తొలిరోజు జోరుగా అమ్మకాలు సాగాయి.

కుక్కల దాడిలో 35 గొర్రెలు మృతి

వార్త 3లో..

'ఎస్‌బిసి'పై వాహనాల అనుమతికి సిపిఎం పాదయాత్ర

వార్త 4లో..

ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో జన్మభూమి ఎక్స్‌ప్రెస్

వార్త 2లో..

ఔషధ రంగంలో అద్వితీయ ప్రగతి

నాణ్యమైన తయారీ విధానాలు అవసరం

అమెరికా ఎఫ్‌ఎ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా



మాట్లాడుతున్న డాక్టర్ కార్మిలో రోసా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఔషధ రంగంలో భారత్ అద్వితీయమైన ప్రగతి సాధిస్తోందని అమెరికాలోని ఎఫ్‌ఎ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసా అన్నారు. గురువారం ఎయు వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఎయు-యుఎస్ ఎఫ్‌ఎ సంయుక్తంగా నిర్వహించిన 'కరెంట్ గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్' రెండు రోజుల వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన ఔషధాల తయారీకి నిరంతరం కృషి జరగాలన్నారు. మరింత మెరుగైన, నాణ్యమైన తయారీ విధానాలను అనుసరించడం ఎంతో అవసరమన్నారు. ఔషధ తయారీ, అనుమతులు, వినియోగం వరకు వివిధ దశల్లో అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఔషధ తయారీలో నియమావళిని క్షుణ్ణంగా పరిశ్రమలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమైన ఔషధాలను అందించడానికి దార్శనికతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్, సీనియర్ ఫార్మసూటికల్ మిగతా 2లో..

బాధితులతో సమావేశానికి వస్తా..

- గిరిజనుల ఇళ్ల నిర్మాణాలకు అటవీ సిబ్బంది అభ్యంతరం చెప్పడం దారుణం
- సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు
- ఇళ్ల పట్టా అమ్మకాలు, బిల్లులపై జెడ్‌పిలో దుమారం



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర



ప్రశ్నిస్తున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించిన సమస్యలకు హామీలు ఇవ్వడం తప్ప పరిష్కారం లభించడంలేదు. అనంతగిరిలో ఆర్ఒఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన స్థలాల్లో గిరిజనులు ఇళ్లు కట్టుకుంటే అటవీశాఖ సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారు. ఇక్కడేమో ఆ సమస్య లేకుండా చూస్తామంటున్నారు. ఇళ్లు కట్టినచోట సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే వచ్చే జెడ్‌పి సమావేశానికి బాధిత గిరిజనులందరితో కలిసి వస్తాను' - అని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి సభ్యుడు దీసరి గంగరాజు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇళ్లు కట్టుకోవడానికి ఎంతోకాలంగా అటవీశాఖ సిబ్బంది పెడుతున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకొచ్చినప్పుడు, పాడేరు డివిజన్ అటవీశాఖాధికారి వినోద్‌కుమార్ స్పందిస్తూ... ఇళ్లు కట్టుకుంటున్న స్థలాల్లో నిర్మాణాలకు ఆటంకాల్లేకుండా చూస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు మాట్లాడుతూ ఇళ్లకు ఎల్‌పిసిలు లేకపోయినా బిల్లుల చెల్లింపునకు ఇబ్బంది మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బాధితులతో సమావేశానికి వస్తా..

వుండదన్నారు. అనకాపల్లి మండలంలో సంపతపురం, కూండ్రం, వెంకుపాలెం, సీతానగరం లే అవుట్లను మార్చాలని ఎంపిపి సూరిబాబు కోరారు.

నిలదీతలు

ఇళ్ల పట్టాల అమ్మకంపై విచారణ ఎంతవరకు వచ్చిందని నర్సీపట్నం జెడ్‌పిటిసి రమణమ్మ నిలదీశారు. అనర్హుల పట్టాలను రద్దుచేసి అర్హులకు మంజూరుచేయాలన్నారు. బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి రాంబాబు మాట్లాడుతూ వడ్డాదిలో వేసిన మూడు లే అవుట్లలో 45 మంది పట్టాలమ్ముకున్నారని, అనర్హులకు పట్టాలివ్వడం వల్ల ఈ తరహా అమ్మకాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సమస్యా పరిష్కరించనప్పుడు సమావేశంలో ప్రస్తావించడం ఎందుకని అన్నారు. సమస్యలిలానే వుంటే వచ్చే సమావేశానికి రానన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించాలని పద్మనాభం జెడ్‌పిటిసి గిరిబాబు అన్నారు. గుడిసెలు తొలగించి ఇళ్లు నిర్మించుకున్న గిరిజనులకు బిల్లులురాకపోవడంపై చింతపల్లి జెడ్‌పిటిసి బాలయ్యపడాల్ ఆవేదన వ్యక్తంచేశారు. గుడిసెలు లేక, ఇళ్లు కట్టులేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను తెలిపారు. వాడచీపురుపల్లి, పరవాడ పిహెచ్‌సిల్లో ఒక అంబులెన్స్‌నైనా అందుబాటులో ఉంచాలని పరవాడ జెడ్‌పిటిసి పైలా సన్యాసిరాజు అన్నారు. కెజిహెచ్‌లో చనిపోయిన గిరిజనులకు వయస్సుతో నిమిత్తంలేకుండా అంబులెన్స్‌లో ఇంటికి పంపించే ఏర్పాటు చేయాలని అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 186 పాఠశాలలు మూసేయాలన్న ప్రభుత్వ చర్యలపై ఆయన అభ్యంతరం తెలిపారు. హుకుంపేట మండలం తాడిపుట్టు పంచాయతీ ఉర్రాడ బొడ్డపుట్టు పాఠశాల ఆవరణలో విద్యుత్ స్తంభం పడి మృతి చెందిన తూభురు తన్విత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశాఖపట్నం, అనకాపల్లి జాయింట్ కలెక్టర్లు కెఎస్.విశ్వనాథన్, కల్పనాకుమారి, అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్, జెడ్‌పి ఉపాధ్యక్షులు బివి.సత్యవతి, అప్పారావు, సిఇఒ శ్రీరామమూర్తి, డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఔషధ రంగంలో అద్వితీయ ప్రగతి

ఎసెసర్ అదితి ఠాకూర్, కంజ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్, తదితరులు ప్రసంగించారు. సదస్సుకు 50కిపైగా ఫార్మా రంగ పరిశ్రమలకు చెందిన 340 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో జన్మభూమి ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే క్రమంలో 20 ఆధునిక లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బి) ర్యాక్‌లతో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను గురువారం ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ ప్రారంభించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి మాట్లాడారు.

693వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 693వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (హెచ్ఎంఎస్) కార్మికులు పాల్గొన్నారు.

పోరాట యోధురాలు పార్వతమ్మకు అశ్రు నివాళి

(మొదటి పేజీ తరువాయి...)

సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పార్వతమ్మ పోరాడారు. బుధవారం సాయంత్రం వరకూ ప్రజలతో మంచి చెడ్డా మాట్లాడుతూ ఆమె గడిపారు. ఒక్కసారిగా ఆరోగ్య పరిస్థితి క్షీణించి క్షణికకాలంలోనే ప్రాణాలు విడిచారు. ఆమె మృతి వార్త తెలియగానే పలువురు తల్లడిల్లారు. ఆమె ఉద్యమ ప్రాబల్యం ఉన్న ప్రాంత మంతటా విషాదఛాయలు అలుముకున్నాయి.

కశింకోట మండలం గొబ్బూరు గ్రామంలో జన్మించిన పార్వతమ్మ కర్రి నర్సింగరావును వివాహం చేసుకున్నారు. తిమ్మరాజుపేట కేంద్రంగా తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంతంలో దొడ్డి రామునాయుడు, ఆళ్ల శ్రీరాములు, పివి.రమణ, కె.గోవిందరావులు వంటి మహానేతలతో కలిసి ఉద్యమంలో నడిచారు. మహిళా జాతీయ నాయకురాలు మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, పుణ్యవతి వంటి వారితో కలిసి మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని ఈ ప్రాంతంలో ఉవ్వెత్తున నడిపారు. విశాఖ జిల్లాలో మహిళా సంఘం స్థాపించి మొట్టమొదటి అధ్యక్షులుగా పార్వతమ్మ భాధ్యతలు చేపట్టారు. నాడు వైదాడ ధర్మారం కార్యదర్శిగా జిల్లాలో మహిళా ఉద్యమాన్ని స్థాపించారు. సారా వ్యతిరేక ఉద్యమంలో ఈ ప్రాంతంలోని మహిళ లందరినీ సమీకరించి ఉద్యమాలు నడిపారు. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, బెల్లం రైతుల ఉద్యమం, నల్ల బెల్లం, క్రషర్ల ఉద్యమం, విద్యుత్ ఉద్యమాలు వంటి అనేక పోరాటాల్లో భాగస్వాములయ్యారు. నాడు ఈ ప్రాంతంలో మంచినీటి సమస్యపై నీటి ఎద్దడి వచ్చిన ప్రతి సందర్భంలోనూ పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి తిమ్మరాజుపేట నుంచి అచ్యుతాపురం ఎంఆర్ఒ ఆఫీస్ వరకూ మహిళలందరితో ఖాళీ బిందెల ప్రదర్శనలు అనేకం నిర్వహించారు. దళిత, బడుగు, బలహీనవర్గాలతో మమేకమయ్యారు.

పోరాటమే శ్వాసగా సాగిన జీవనం

పార్వతమ్మ జీవనం పోరాటంతోనే సాగింది. వివాహమైనప్పటి నుంచీ ఆమె భర్త అడుగుజాడల్లో నడుచుకుంటూ భర్తతోపాటు తనూ పోరాటాల్లో పాల్గొనేది. పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించేది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధనగా ఇద్దరూ కలిసి వ్యవసాయం చేయించేవారు. ఒకవైపు వ్యవసాయం మరొకవైపు కుటుంబ బాధ్యతలు, ఇంకోవైపు సిపిఎం సభలు, సమావేశాల్లో చురుకైన పాత్ర పోషించేవారు. భర్త అకాలంగా మృతి చెందినప్పటికీ ఆమె పోరాటాన్ని ఆపలేదు. గ్రామంలో అగ్ని ప్రమాదం సంబంధించి కట్టుబట్టలతో రోడ్డుపై పడిన అగ్ని బాధితులకు బాసటగా నిలిచారు. విరాళాలు సేకరించి వంట పాత్రలు అందించారు. ఆర్థిక సహాయం చేశారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలను చేయడంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషించారు.

మద్యం షాపులపై దాడి

సంపూర్ణ మద్యపాన నిషేధం సమయంలో దోబగుంటలో పోరాటం మొదలైందని తెలిసిన వెంటనే ఆమె ఇక్కడ స్పందించారు. గ్రామంలో ఉన్న మద్యం షాపులపై తోటి మహిళతో సామూహికంగా దాడి చేశారు షాపులు మూసేంత వరకూ పోరాటం కొనసాగించారు. మద్యం సేవించిన వారితో ప్రమాణం చేయించి వారిని మద్యపాన నిషేధ పోరాటంలో భాగస్వామ్యం చేసిన ఘనత పార్వతమ్మకు దక్కుతుంది. గ్రామంతోపాటు మద్యం సిండికేట్ కొండకర్లలో ఉండేది. సిండికేట్ వ్యాపారి వద్దకు మహిళలతో తరలి వెళ్లి తీవ్ర స్థాయిలో ఆనాడు ధ్వజమెత్తారు. గ్రామం నుంచి మొదలైన ఆమె పోరాటం మునగపాక, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ, యలమంచిలి మండలాల్లోనూ సాగింది. ఆమె కులాంతర వివాహాలను ప్రోత్సహించేవారు. కట్న వేధింపులతో బాధపడుతున్న మహిళలకు అండగా నిలిచి వారి తరపున పోలీస్ స్టేషన్లకు తరలివెళ్లి న్యాయం చేసే వరకు బాధిత కుటుంబాలతో కలిసి పనిచేశారు.

పార్వతమ్మ ఇల్లే సత్రం

పార్టీ పరంగా గ్రామానికి వచ్చి ప్రజలతో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడానికి పార్టీ కార్యకర్తలకు ఆమె ఇల్లే కార్యాలయంగా నిలిచింది. పార్టీ నుంచి.. ఎక్కడి నుంచి.. ఏ స్థాయి నుంచి ఎవరొచ్చినా ఆమె ఇంటికి వచ్చేవారు. వారిని సాదరంగా స్వాగతించి భోజనం, వసతి సదుపాయాలు సమకూర్చేవారు. ఇంటి దగ్గరకే కులవృత్తిదారులను, పార్టీ కార్యకర్తలను పిలిచి తరగతులు నిర్వహించేవారు. గ్రామస్థాయి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. మహిళలకు బహుముఖ పోటీలు నిర్వహించి వారిలో చైతన్యం నింపారు.

మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయంతో కలిసి ఉద్యమం

పార్వతమ్మ రైతు ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. మునగపాకలో జిల్లా స్థాయి రైతు సంఘం సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ఆమె మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయంతో కలిసి పని చేశారు. తిమ్మరాజుపేట గ్రామంలో వారి ఇద్దరితో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఐద్వా జాతీయ నేత పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అలా పలువురితో కలిసి ఆమె చురుగ్గా పని చేశారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తదితరులతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నారు.

కమ్యూనిస్టు కుటుంబం

పార్వతమ్మకు ఇద్దరు కుమార్తెలు రూపవతి, సుగుణవతి, ఇద్దరు కుమారులు సుందరయ్య, స్వామి బాబు ఉన్నారు. వారిని కమ్యూనిస్టు భావాలకు అనుగుణంగానే పెంచి పెద్ద చేశారు. 1979లో తన 40వ ఏటే భర్త మరణించినా పిల్లలను పెంచి ఉన్నతంగా తీర్చిదిద్దారు. మహిళలను సైతం పురుషులతో సమానంగా పెంచారు. వారికి ఆ కాలంలోనే సైకిల్ తొక్కటం వంటివి నేర్పారు. పురుషులతో సమానంగా ఆటలలో ప్రోత్సహించారు. నేటికీ కుమారులు సుందరయ్య, స్వామి బాబు ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారు. సుందరయ్య ఎస్ఎఫ్ఐ ఉద్యమ నాయకునిగా పలు సమస్యలపై పోరాటాలు నడిపారు.

సిపిఎం, ఐద్వా ఘన నివాళి

పార్వతమ్మ పార్థివ దేహంపై సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పార్టీ పతాకాన్ని కప్పి ఘనంగా నివాళ్లర్పించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ప్రజా సంఘాల నాయకులు ఎ.బాలకృష్ణ, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, కె.సోమునాయుడు, రామసదాశివరావు, తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు. లోకనాథం మాట్లాడుతూ ఆమె పోరాట గొప్పతనాన్ని వివరించారు. పార్వతమ్మ ఎందరికో ఆదర్శమన్నారు. పార్వతమ్మ మృతి మహిళా ఉద్యమాకి తీరని లోటు అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా మహిళా ఉద్యమ నిర్మాతల్లో ఆమె ఒకరన్నారు. పార్వతమ్మ కుటుంబ సభ్యులకు పార్టీ తరపున సానుభూతిని తెలిపారు. పార్వతమ్మ మృతికి ఐద్వా విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు సంతాపం తెలిపాయి. ఈ మేరకు విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఒక ప్రకటన విడుదల చేశారు.

'చేదోడు' అందకుంటే ఆధార్ ఇవ్వండి

ప్రజాశక్తి -తగరపువలస : చేదోడు పథకం కింద అర్హులై ఉండి కూడా ఆర్థిక సాయం అందని టైలర్లు తనకు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు ఇస్తే బిసి కార్పొరేషన్ ఎడి దృష్టికి తీసుకెళ్తానని ఎపి టైలర్స్, వర్కర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ, గతంలో కూడా 50 మంది టైలర్లకు ఆర్థిక సాయం అందకుంటే బిసి కార్పొరేషన్ ఎడి దృష్టికి తీసుకెళ్లగా న్యాయం జరిగినట్లు వివరించారు. అనేక కారణాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 14 వేలు, విశాఖ జిల్లాలో 5వేల మందికి ప్రస్తుతం చేదోడు పథకం కింద ఆర్థిక సాయం అందలేదని తెలిపారు. జిఒ 164 ప్రకారం టైలర్లను చేనేత, జౌళి శాఖలో విలీనం చేసినప్పటికీ, అందుకు అనుగుణంగా 50 ఏళ్లు పైబడిన వారికి పింఛను అందడం లేదన్నారు. టైలరింగ్ వృత్తిపై ఆసక్తి ఉన్న వారికి ప్రభుత్వమే వృత్తి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- పిఎం పాలెం : సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పిఎం పాలెం సబ్‌స్టేషన్ ఎఇ ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పిలకవానిపాలెం, కారుషెడ్ జంక్షన్, బృందానగర్, సప్తగిరి కాలనీ, ధర్మపురి కాలనీ, సుందర్‌నగర్, పీర్లెస్ కాలనీ, చైతన్యపురి లే-అవుట్, షిప్‌యార్డ్ లే-అవుట్, మంగళ సూరి కాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సేవాదళ్ అధ్యక్షునిగా మారుతీప్రసాద్



ప్రజాశక్తి - మధురవాడ : వైసిపి అనుబంధాల విభాగంలో భాగంగా విశాఖ జిల్లా సేవాదళ్ అధ్యక్షునిగా మధురవాడ ప్రాంతానికి చెందిన వంకాయలు మారుతీప్రసాద్ నియమితులయ్యారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకారం అందించిన వై.వి.సుబ్బారెడ్డి, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మారుతీప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కొర్రపల్లి కాలనీలో ఉన్న నిరుపేద కుటుంబానికి రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, గాయత్రి వెల్ఫేర్ కల్చర్ యూత్ అకాడమీ సంయుక్తంగా నిత్యావసరసరుకులను అందించాయి. రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ, పిల్లల చదువుకు ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపారు.

వైసిపిలో ఫ్లెక్సీ రగడ

ప్రజాశక్తి -మధురవాడ : కారు షెడ్డు ప్రాంతంలో వైసిపి ఎమ్మెల్సీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఫోటో లేకపోవడంపై రగడ నెలకొంది. కార్యకర్తలు కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. లోపం గుర్తించిన నాయకులు ముత్తంశెట్టి ఫోటోను ఫ్లెక్సీపై అతికించడంతో కార్యకర్తలు శాంతించారు.


కుక్కల దాడిలో 35 గొర్రెలు మృతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి జోన్-2 పరిధి మధురవాడ సమీపం, ధర్మపురి కాలనీ వద్ద మంద వేసిన గొర్రెలపై బుధవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 35 గొర్రెలు మృతిచెందాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం పోలాకి గ్రామానికి చెందిన రమణ గొర్రెలను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు ప్రతిఏటా దసరాకు మధురవాడ వచ్చి అప్పటి వరకు ఉన్న గొర్రెలను విక్రయించి తిరిగి స్వగ్రామానికి వెళుతుంటాడు. గత అక్టోబరులో సుమారు 200 గొర్రెలతో వచ్చి ధర్మపురి కాలనీ సమీపంలో తాత్కాలిక నివాసం ఏర్పరుచుకొని ఉం టున్నాడు. బుధవారం రాత్రి గొర్రెల మందపై ఒకేసారి ఆరు కుక్కలు దాడి చేసి 35 గొర్రెలను కొరికి చంపాయి. సంఘటన జరిగిన ప్రదేశాన్ని వెటర్నరీ డాక్టర్లు అరుణ్, జివిఎంసి ఎఎమ్‌హెచ్‌ఒ డాక్టర్ కిశోర్ తదితరులు సందర్శించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు గొర్రెల యజమాని రమణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.3 లక్షలు విలువైన గొర్రెలు చనిపోయినట్లు రమణ తెలిపాడు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎఎమ్‌హెచ్‌ఒ కిశోర్ తెలిపారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ఘనంగా ఇంద్రజాల దినోత్సవం



పిసి సర్కార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రకాశరావు

ప్రజాశక్తి - అరిలోవ : బాలవికాస ఫౌండేషన్ ఆధ్వర్యాన చినగదిలిలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గురువారం ఇంద్రజాల దినోత్సవాన్ని నిర్వహించారు. పిసి.సర్కార్ చిత్రపటానికి బాల వికాస ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బాలికలు చదువుతో పాటు కళల్లో కూడా రాణించాలన్నారు. బాలల్లో శాస్త్రీయ దృక్పథం, ఆలోచనలు పెంపొందించే దిశగా ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గోపాలపట్నానికి చెందిన యువ మెజీషియన్ ఎస్‌కె.అన్వర్ భాషా, స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కె.విజయకుమార్ మేజిక్ ప్రదర్శన ఇచ్చారు. గాలిలో పావురాలు, జెండాను సృష్టించడం, ఖాళీ పుస్తకంలో బొమ్మలు తదితర ప్రదర్శనలు బాలలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హోం అధికారి ఎయు.సునీత డాక్టర్ బాబ్జీ, సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పూల మార్కెట్‌లో ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాల నివారించవచ్చని తెలిపారు. ఆటో ముందు సీట్లో డ్రైవర్ పక్కన ఎవరిని కూర్చో పెట్టకూడదన్నారు. డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలని, మద్యం తాగి ఆటో నడపకూడదని చెప్పారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగితే కుటుంబం రోడ్డున పడుతున్న విషయాన్ని గుర్తించాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో 25 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రఘురాం

క్రికెట్ పోటీలకు విక్రాంత్ కౌల్ ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న సన్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ విద్యార్థి విక్రాంత్ కౌల్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యాన మచిలీపట్నం ఎజి.కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న విక్రాంత్ కౌల్ మేటిగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని ఆయన అభినందించారు. అభినందన కార్యక్రమంలో పిఇటి అరుణ్ పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -కంచరపాలెం : నగరంలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న జి-20 సదస్సు నేపథ్యంలో జాతీయరహదారి ఆధునీకరణ పనులను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు నేరుగా పరిశీలించారు. ఎన్ఎడి నుంచి బిర్లా జంక్షన్ వరకు జాతీయ రహదారిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రహదారికి ఆనుకొని ఉన్న ప్రాంతాలను తెలిపే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రహదారి కిరువైపులా, సెంట్రల్ మీడియంలోను పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, గోడలకు ఉన్న ప్రకటనల బోర్డులు, కేబుల్ వైర్లు, పోస్టర్లను తొలగించి శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బస్ స్టాప్‌లను ఆధునికీకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, గ్రీన్ బెల్టులకు రక్షణగా ఉన్న గ్రిల్స్‌ను కట్ చేసి రహదారులుగా ఏర్పాటు చేస్తున్నారని, వాటిని నివారించాలని చెప్పారు. రోడ్డు పక్కన గోడలు, నడకదారుల మరమ్మత్తులు చేపట్టి ఆకర్షణీయమైన రంగులు వేయాలని, సదస్సులు జరిగే సమయంలో పారిశుధ్య కార్మికులను ఆయా ప్రాంతాలలో ఉంచి రోడ్డును శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తీరానికి గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి -అరిలోవ : సాగర్‌నగర్ బీచ్‌లో గురువారం ఉదయం 9 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతునికి 40 నుంచి 45 ఏళ్లు ఉండవచ్చని, మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలూ లభించలేదని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారంలో భద్రపరిచినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి : 14 మంది అరెస్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాటితూరు గోస్తనీ సమీపంలో గురువారం పేకాట శిబిరంపై స్థానిక ఎస్ఐ గంటా హరీష్ ఆధ్వర్యాన సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న తాటితూరు కల్లాలకు చెందిన 14 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.61,170 స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఇసుక అక్రమ రవాణాపై కేసు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దేరు నది నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏపి 39 7జె 3046 నెంబర్ గల వ్యాన్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై కుమార్ స్వామి గురువారం తెలిపారు. ఇసుక రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించి, నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

స్కూటీ డిక్కీ నుంచి రూ.2.18 లక్షల చోరీ

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ఎలమంచిలిలో పురానా దోపిడీ జరిగింది. పట్టపగలే స్కూటీ డిక్కీ నుంచి రూ.2.18 లక్షలు చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యలమంచిలి పట్టణానికి చెందిన చక్క అప్పారావు గురువారం యలమంచిలి స్టేట్ బ్యాంకులో రూ.2.28 లక్షలు విత్ డ్రా చేశారు. అందులో పదివేల రూపాయల మొత్తానికి సంబంధించి నోట్లు చిరిగి ఉండడంతో గమనించి రూ.2.18 లక్షలను తన స్కూటీ డిక్కీలో పెట్టి, చిరిగిన నోట్లు మార్చుడానికి బ్యాంకు లోపలకు వెళ్లారు. ఆయన తిరిగి వచ్చేసరికి స్కూటీ డిక్కీలో పెట్టిన 2.18 లక్షలు అపహరణకు గురయ్యాయి. దీంతో బాధితుడు ఎలమంచిలి పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రూ.31 లక్షలు చోరీకి గురైన సంగతి తెలిసిందే. మరో సంఘటనలో 18 లక్షలు అపహరణకు గురయ్యాయి. ఎలమంచిలి పట్టణంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో స్థానిక వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి సంవత్సరాలు గడుస్తున్న పోలీసులు రికవరీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీకి గురైన సొత్తును రికవరీ చేయవలసిందిగా బాధితులు కోరుతున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- మాకవరపాలెం: మండలంలోని కొండల అగ్రహారం జంక్షన్ వద్ద ఎస్సై రామకృష్ణ సిబ్బంది కలిసి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు బైక్ పై వెళు తున్న ఇద్దరి వ్యక్తులను తనిఖీ చేసి 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించామన్నారు.

నవజాత శిశువుల అంధత్వ నివారణలో 'ఎల్‌వి' ఘనత



డాక్టర్ బావిక్ పాంచల్

ప్రజాశక్తి - అరిలోవ : నవజాత శిశువుల అంధత్వ నివారణలో భాగంగా లక్షకు పైగా శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన ఘనత ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు దక్కుతుందని ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ బావి పంచల్ అన్నారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రధాన మైలురాయి అధిగమించిందని చెప్పారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో ఎల్‌విపిఇఐ అట్లాస్ ఆఫ్ రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ అండ్ అదర్ నియోనేటల్ డిజైన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బావిక్ పంచల్ మాట్లాడుతూ, భారతదేశంలో ఆర్‌ఒపి పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహించడంలో ఎల్‌విపిఇఐ అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులకు ఈ అట్లాస్ ఒక మంచి సాధనమని డాక్టర్ ఆకాష్ బెలంజ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బిసి'పై వాహనాల అనుమతికి సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి -ములగాడ : ఎస్‌బిసి బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలకు అనుమతించాలని కోరుతూ జివిఎంసి 63వ వార్డు పరిధి కాకరలోవలో పాదయాత్రను సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, మేయర్, ఎంపిలు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని నావికదళ అధికారులతో చర్చించి డాక్‌యార్డు బ్రిడ్జి పైనుంచి వాహనాల రాకపోకలకు అనుమతించేలా చూడాలని కోరారు.

1968 నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ డాక్ యార్డ్ చిన్న బ్రిడ్జి పై నుంచి నిత్యమూ వేల వాహనాల ద్వారా లక్షలాదిమంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. బ్రిడ్జి శిథిలావస్తకు చేరుకోవడంతో 15 నెలల పాటు మూసివేస్తామని విశాఖ పోర్టు నిర్ణయించిందని తెలిపారు. బ్రిడ్జి బాగుచేయడం మంచిదేనని, కానీ అంతవరకు పక్కనే ఉన్న ఎస్‌బిసి వంతెనపై నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించాలని తూర్పు నావికాదళ అధికారులకు విజ్ఞప్తిచేశారు. జివిఎంసి పరిధిలో గల 40, 58 నుంచి 63, 64 వార్డుల్లో సుమారు రెండు లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారని, వీరు ఎమర్జెన్సీ వైద్యానికి నగరంలోని కెజిహెచ్, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు డాక్ యార్డు బ్రిడ్జి పైనుంచే వెళ్తున్నారని తెలిపారు. ఇప్పుడు బస్సు వెళుతున్న మార్గం గుండా ప్రయాణించాలంటే ప్రాణాలకు రక్షణ ఉండదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. డాక్ యార్డు గౌడౌన్స్, మారుతి జంక్షన్ మీదుగా కాన్వెంట్ జంక్షన్ చేరుకోవడానికి సుమారు ఆరు కిలోమీటర్లు పెరుగుతుందని, ఈమార్గంలో మూడు రైల్వే ట్రాకులు, వందలాది భారీ వాహనాలు రాత్రి పగలు ప్రయాణిస్తాయని తెలిపారు. ప్రజల ప్రాణాలకు రక్షణ ఉండదు కనుక రక్షణ రంగం అవసరంకోసం నిర్మించుకున్న బ్రిడ్జిపై వాహనాలకు అనుమతులు వచ్చే విధంగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని కోరారు. ఈ పాదయాత్రలో సిపిఎం జోన్ నాయకులు కె.పెంటారావు, ఎన్.శ్రీనివాసరావు, పివి.భాస్కరరావు, పి.సురేష్ డి.గోపాల్, ఆదినారాయణ పాల్గొన్నారు. 59వ వార్డు నెహ్రూనగర్ లేబర్ జంక్షన్ నుంచి చేపట్టిన పాదయాత్రలో ఆర్.లక్ష్మణమూర్తి, వై.గంగాధర్ బి.శ్రీను, డి.రాజేష్, సుభాని, రాజు, పైడినాయుడు, 62వ వార్డు త్రినాధపురం పాదయాత్రలో సిపిఎం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయుకులు పి.రామారావు, ఎల్.కృష్ణ బి.జగ్గునాయుడు, బి.అర్జునరావు పాల్గొన్నారు.



పాదయాత్రలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

జిఒ 60, 71లపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలి : టిడిపి

ప్రజాశక్తి -గాజువాక : జిఒ. 60, 71లపై గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చొరవ తీసుకొని అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని టిడిపి గాజువాక నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ప్రసాద్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పాత గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎందుకూ పనికి రాని జిఒలు ఇచ్చారని విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన జిఒ. 44కు ఎటువంటి ఆటంకాలు కలిగించకుండా రిజిస్ట్రేషన్, ప్లాన్ అప్రూవల్‌కు తెలుగుదేశం ప్రభుత్వం అవకాశం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిఒ 301 ప్రకారం 7500 ఇళ్లకు రిజిస్ట్రేషన్ కల్పించాలని డిమాండ్‌చేశారు. జిఒ 296 పట్టాలపైన బేషరతుగా ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెరుకూరు నాగేశ్వరరావు, తమరి శివప్రసాద్, బలగ బాలునాయుడు, రట్టి వాసు, నమ్మి అప్పారావు, పోతున వెంకటరావు, పోలవరపు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యూత్ వింగ్ అధ్యక్షునిగా శివగణేష్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లా వైసిపి యూత్ వింగ్ అధ్యక్షునిగా ఆళ్ల శివగణేష్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆళ్ల శివగణేష్ మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో యువత ద్వారా పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషిచేస్తానన్నారు. తనకు పదవి కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఉత్తరాంధ్ర వైసిపి రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి, ఎంపీ ఎంవివి సత్యనారాయణకు, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు చెప్పారు. ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఎంపిక చేసిన శాసనమండలి అభ్యర్థుల విషయంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు, రాజ్యసభ, మంత్రిమండలి వరకు అన్నింటా వారికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వైసిపికి ఉన్న 36 ఎమ్మెల్సీలో 25 మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి వారేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కెవిఎన్ శశికళ, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న జూనియర్ న్యాయవాదులు

లానేస్తం ద్వారా జూనియర్ న్యాయవాదులకు లబ్ధి : కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : లానేస్తం ద్వారా జూనియర్ న్యాయవాదులకు లబ్ధి చేకూరుతుందని ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. న్యాయవాదుల ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయం ఆవరణలో గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో జూనియర్ న్యాయవాదులకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని అన్నారు. లా నేస్తం పథకం ద్వారా ప్రతినెలా రూ.5000 చొప్పున ఆరు నెలలకు ఒకసారి రూ.30వేలును జూనియర్ న్యాయవాదుల ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, కెవిఎన్.శశికళ, ఎరంశెట్టి శ్రీనివాసరావు, చిన్నారావు, బోర పరదేశి రెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు న్యాయవాదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌరుల చైతన్యంతోనే ప్రజాస్వామ్యానికి రక్ష


అధ్యయన పత్రాలు సమర్పిస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి ములగాడ : పౌరులు చైతన్యవంతులైనప్పుడే ప్రజాస్వామ్యానికి రక్ష ఉంటుందని సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన "భారత రాజకీయాలు- పౌర చైతన్యం" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ, ఇటీవలి కాలంలో ప్రజలు, విద్యావంతులు, చైతన్యవంతులయ్యారని తెలిపారు. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ద్వారా, సమాచార హక్కు చట్టం ద్వారా, న్యాయ సమీక్ష ద్వారా, మీడియా ద్వారా ప్రభుత్వాన్ని అదుపులో పెడుతున్నారని, ఇది శుభ సూచకమని పేర్కొన్నారు. రాజనీతి శాస్త్ర విభాగం సీనియర్ అధ్యాపకులు వై.అనసూయాదేవి మాట్లాడుతూ, పౌరులు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ద్వారా తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని సరైన నాయకులను ఎన్నుకుంటే ప్రజాస్వామ్యం నిలబడుతుందన్నారు. అనంతరం భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, పార్లమెంటు అధికారాలు, విధులు, రాష్ట్రపతి అత్యవసర అధికారాలు, క్యాబినెట్ నిర్మాణం, ప్రధానమంత్రి కార్యాలయం, రాష్ట్ర గవర్నర్ విచక్షణ అధికారాలు, పంచాయతీ రాజ్‌లో వస్తున్న మార్పులు, భారత ప్రభుత్వ సమాఖ్య వ్యవస్థ, ఎన్నికల సంస్కరణల గురించి విద్యార్థినులు తమ అభిప్రాయాలను అధ్యయన పత్రాల రూపంలో సమర్పించారు. అధ్యయన పత్రాలపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. విద్యార్థినులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు అధ్యాపకురాలు అనసూయదేవి సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రాజనీతి శాస్త్ర విభాగాన్ని, విద్యార్థినులను ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ అభినందించారు. ఇటువంటి సదస్సులు విద్యార్థినుల్లో ఆసక్తిని, జ్ఞాపకశక్తిని పెంచుతాయని కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. సదస్సును విద్యార్థి నాయకులు అవంతి, ధనుషా, ధనలక్ష్మి, సాక్షి, శ్రేయ సమన్వయం చేశారు.

ఈనాడుపై వైసిపి ఆగ్రహం : పత్రికలు దగ్ధం

ప్రజాశక్తి-యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కె.పట్టాభిరామ్‌పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, తీవ్ర గాయాలయ్యాయని ఈనాడు తప్పుడు రాతలు రాసిందంటూ వైసిపి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. పలుచోట్ల ఈనాడు దిన పత్రికలను గురువారం దగ్ధం చేశారు. పలు చోట్ల సమావేశాలు నిర్వహించి ఈనాడు కథనాన్ని ఖండించారు.

గాజువాక : గాజువాక బిసి రోడ్డులోని టివిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఈనాడు పత్రికలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యాన దగ్ధంచేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి ఈనాడు పత్రిక యజమాని రామోజీరావు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఈనాడు పత్రిక కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చందు, వంశీరెడ్డి, కేబుల్ మూర్తి, వైసిపి నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, పరదేశి, చిత్రాడ వెంకటరమణ, బొడ్డ గోవింద పాల్గొన్నారు.

కంచరపాలెం : పచ్చ కుల మీడియా అయిన ఈనాడు, ఆంధ్రజ్యోతి అబద్ధపు వార్తలను రాసిందని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. మర్రిపాలెం ఉడా లే-అవుట్‌లోని పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టాభిరామ్‌పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని తప్పుడు రాతలు రాసిందని, దీనిపై ప్రభుత్వం స్పందించి చిత్తశుద్ధితో వైద్య పరీక్షలు చేయించగా, కేవలం అవి అనారోగ్య సమస్యల వల్ల వచ్చిన వాపులు మాత్రమేనని నివేదిక వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. లోకేష్ పాదయాత్ర విఫలమవడం, ప్రజల ఆదరించకపోవడంతో చంద్రబాబుకు దిక్కు తోచక ఇటువంటి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గాది శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు పివి సురేష్, బెహరా భాస్కరరావు, గుండపు నాగేశ్వరరావు, ముర్రువాణి నానాజీ, నాయకులు కలిదిండి బద్రీనాథ్, దొడ్డి కిరణ్, చుక్కా ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు


ఈనాడు పత్రికలను దగ్ధం చేస్తున్న వైసిపి నాయకులు

పాఠశాలల్లో బాలల హక్కుల రక్షణకు చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలోని ప్లే స్కూళ్లలో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టేలా విద్యాశాఖ, స్త్రీ,శిశుసంక్షేమ శాఖ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు ఆదేశాలు జారీచేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. సీతమ్మధారలోని లిటిల్ కగ్నెల్ ప్లే స్కూల్లో విద్యార్థులను ఎండలో నిలుచోపెట్టి దండన విధించడంపై ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై స్పందించి గురువారం ఆయన విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వార్డు సచివాలయాల అధికారులతో కలిసి పాఠశాలను సందర్శించారు. పిల్లలను, వారి తల్లిదండ్రులను విచారించారు. ప్రిన్సిపల్ వెన్నెల నుంచి పూర్తి వివరాలు సేకరించారు, పాఠశాలలో ఉన్న వివిధ సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు 2015 జెజెబి చట్టం, సెక్షన్ 21, సెక్షన్ 82 కార్పొరెల్ శిక్షల నియమావళి పరిశీలనలోకి తీసుకొని స్కూల్ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు, ఎస్పీలకు, ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తున్నామని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు విఘాతం కలిగించే వ్యక్తులు, సంస్థలపై నేరుగా apscpcr2018@gmail.com కు ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సువర్ణ, సీతమ్మధార వార్డు సచివాలయాల కార్యదర్శులు ఎస్.శిరీష, ఇంద్రజ, పి.రంజిత, డి.నిర్మలా దేవి, వి.వెంకటలక్ష్మి, వై.మంగ, ఎన్.జనార్దనరావు, సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.శకుంతల, ఫోరం ప్రతినిధులు డాక్టర్ జగ్గారావు, డాక్టర్ లవకుశ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భెల్ త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ విజయం

ప్రజాశక్తి -గాజువాక : భెల్ త్రిఫ్ట్ సొసైటీకి గురువారం జరిగిన ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో 472 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎనిమిది మంది డైరెక్టర్లకు ఎన్నిక జరిగింది. సిఐటియు ప్యానెల్ నుంచి జిటిపి ప్రకాష్ విజయం సాధించారు. యునైటెడ్ ఫ్రంట్ నుంచి ఏడుగురు గెలుపొందారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఆపాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి


ప్రజాశక్తి-అనకాపల్లి

మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై ప్రభుత్వం, అధికారులు వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె తమాట్లాడుతూ మెనూల పేరుతో ఒత్తిడి తేవడంతో కార్మికుల ప్రమాదాలకు, అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 10 గంటలకు విద్యార్థుల లెక్క ఇచ్చి 12.30 గంటలకు భోజనాలు తయారు చేయడమంటే ఎంతో ప్రయాసతో కూడుకుందని వాపోయారు. ఒక్కో పాఠశాలలో 500 మంది నుంచి 4 వేల మంది వరకు విద్యార్థులున్నారని, కేవలం రెండున్నర గంటల్లో వంట తయారు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. తీవ్ర ఒత్తిడికి గురైన శ్రీకాకుళం జిల్లా ముళియాపుట్టు మండలం జూడుపల్లి కార్మికురాలు వంట చేస్తూ కాలిపోయి, కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు.

మార్చి ఒకటి నుంచి ఉదయం 9 గంటలకు రాగి మాల్ట్ పెట్టాలని కొత్త మెనూ తెస్తున్నారని, వర్కర్లను పెంచకుండా, కేవలం రూ.3వేలు వేతనం ఇచ్చి పని ఒత్తిడి విపరీతంగా పెంచడం దారుణమన్నారు. ఇన్ని వంటలను చేయమని చెబుతున్న ప్రభుత్వం వంట పాత్రలు, గ్యాస్ సదుపాయం, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఈఎస్ఐ, చనిపోయిన వారికి నష్టపరిహారం వంటివి కల్పించడం లేదని తెలిపారు. ప్రభుత్వం కార్మికులను పొమ్మనకుండా పొగబెట్టినట్టు తీవ్ర ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. పని భారం తగ్గించి, వేతనాలు పెంచాలని, అన్ని వసతులు కల్పించాలని, చనిపోయిన కార్మికురాలికి నష్టపరిహారం ఇవ్వాలని, 9, 10 తరగతి తరగతులకు వంట చేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిడ్డేమీల్స్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి



ఆందోళనలో పాల్గొన్న నేవీ నిర్వాసితులు

శాశ్వత పరిష్కారం చూపాలి

116వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- రాంబిల్లి

ప్రత్యామ్నాయ నావికా స్థావరం నిర్మాణానికి సర్వం కోల్పోయిన తమకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎన్ఎఓబి నిర్వాసితులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ ప్రధాన గేట్ ముందు 8 గ్రామాల ఎన్ఎఓబి నిర్వాసితులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 116వ రోజుకు చేరింది. రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేవీ నిర్మాణంతో సముద్రంలో చేపల వేట సాగక తమ ఉపాధి పోయిందని, తమ కుటుంబాల జీవనం సాగడం లేదని వాపోయారు. కేజీ పాలెం, గోవిందపాలెం, కొత్తపేట, చిన్న కలవలపల్లి, వాడ రాంబిల్లి, వాడ నరసాపురం, కొత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమకు జీవన భృతి కల్పించాలని, జెట్టీ నిర్మాణం చేపట్టాలని, అంత వరకు నేవీ గేట్ లోపల నుంచి ఆధార్ కార్డు ఆధారంగా చేపల వేటకు అనుమతి ఇవ్వాలని, పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు, జెఎసి పెద్దలు పాల్గొన్నారు.


వినియోగంలోకి వచ్చిన మరుగుదొడ్లు ఇవే..

ట్విట్టర్ ఫిర్యాదుతో వినియోగంలోకి మరుగుదొడ్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఏడాది కిందట నిర్మాణాలు పూర్తి చేసుకుని నిరుపయోగంగా పడి ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని కోరుతూ వినియోగదారుల మండలి కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ట్విట్టర్ ద్వారా చేసిన ఫిర్యాదుకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ స్పందించారు. జోనల్ కమిషనర్ సూచన మేరకు 81వ డివిజన్ కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య, అధికారులు గురువారం మరుగుదొడ్లను సందర్శించి తాళాలు తెరిపించి వినియోగంలోకి తెచ్చారు. నిత్యం రద్దీగా ఉండే చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ కాయగూరల మార్కెట్ దుకాణ సముదాయంలో ప్రజల ఇబ్బందులను గ్రహించి ఈ మరుగుదొడ్లను ఏడాది కిందట నిర్మించారు. ప్రారంభోత్సవం నెపంతో ఏడాదిగా ఈ టాయిలెట్లు తెరవలేదు. ట్విట్టర్ ఫిర్యాదుతో ఈ నెల 18న ప్రభుత్వం దృష్టికి తేవడంతో స్పందించి టాయిలెట్లను తెరిచారు. దీంతో పాదచారులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వార్డులో ఉన్న సమస్యలను సామాజిక మాధ్యమాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా వెంకటరమణ కోరారు.

ముసుగేసేశారు..

ప్రజాశక్తి కథనంతో వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు తొడిగిన అధికారులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి అధికారులు అప్రమత్తమై మండలంలోని వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు తొడిగారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు అన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం, కటౌట్లు, ఫ్లెక్సీలను తొలగించడం చేశారు. అయితే వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో రాజీవ్‌గాంధీ, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలు ఉండగా, రాజీవ్ గాంధీ విగ్రహానికి మాత్రమే ముసుగు వేసి, రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ముసుగు వేయలేదు. దీంతో ప్రజాశక్తి గురువారం 'అధికారమా.. మజాకా' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమై గురువారం ఉదయం 7 గంటల సమయంలోనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి గోనెసంచితో ముసుగు వేశారు.


వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాకు నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ సోమరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయరామరాజుపేట, వడ్డాది, బంగారుమెట్ట, లోపూడి, ఎల్ సింగవరం, పొట్టిదొరపాలెం, ఎల్బీ.పురం, కోమల్లపూడి, మంగళాపురం, కుముందానిపేట, కొండెంపూడి, గంటి కొర్లాం గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వర్సిటీ, కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు

ప్రజాశక్తి- సబ్బవరం

అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు సబ్బవరం మండలంలోని అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక సిఐ పి.రంగనాథం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీల్లో సీనియర్ లెక్చరర్ (పురుషుడు), సీనియర్ లెక్చరర్ (స్త్రీ), హాస్టల్ అధారిటీ నుండి ఒకరు, సీనియర్ విద్యార్థి ఒకరు, పోలీస్ స్టేషన్ నుండి ఒకరు చొప్పున మొత్తం ఐదుగురు ఉంటారని పేర్కొన్నారు. ఈ కమిటీ సభ్యులు కాలేజీలో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, లైంగిక వేధింపులు, గంజాయి, మద్యం సేవించడం వంటి వాటిని నియంత్రించనున్నట్లు తెలిపారు. ఆయా విద్యా సంస్థల్లో ఒక ఫిర్యాదు పెట్టెను కూడా ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులు తమ ఫిర్యాదులను అందులో వేయవచ్చని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుల పెట్టెను వారానికి ఒకసారి కమిటీ సభ్యులు తెరుస్తారని, వాటిపై తగు చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. గంజాయి తాగే వారిని గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, మండల ప్రజలు గంజాయి వినియోగదారులు, విక్రయదారుల గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

రాష్ట్రస్థాయికి పది ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లిలో ఈ నెల 22 23 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులను ఆకట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా 103 పాఠశాలల నుంచి 117 ప్రాజెక్టులు ఐదు ఉప అంశాలతో ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్, ఎన్విరాన్మెంటల్ అండ్ క్లైమేట్ చేంజ్, హెల్త్ అండ్ క్లీన్లినెస్, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్, మ్యాథమెటికల్ మోడలింగ్‌లో ప్రదర్శించారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్‌లో కోటవురట్లకు చెందిన పి.పద్మశ్రీ, పి.ప్రకాష్ ప్రథమ, ద్వితీయ స్థానాలు, ఎన్విరాన్మెంటల్ అండ్ క్లైమేట్ ఛేంజ్‌లో సబ్బవరం, శెట్టిపల్లికి చెందిన బి.మోన్విత బి.పల్లవి ప్రథమ ద్వితీయ స్థానాలు, హెల్త్ అండ్ క్లీన్లినెస్‌లో గుడిచర్ల, ఆరిపాక పాఠశాలలకు చెందిన పి.సోమనాథ్, పి.వర్షిత, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్‌లో వీరనారాయణపురం, అచ్యుతాపురం రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన వై త్రివేణి, ఎస్.యామిని, మ్యాథ్‌మెటికల్ మోడలింగ్‌లో తిమ్మరాజుపేట, లింగరాజుపాలెం పాఠశాలలకు చెందిన ఎస్.ఆదిత్య, జి గణేష్ వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ, ఉప విద్య శాఖ అధికారి ప్రేమ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.రవి బాబు, ఏపీవో వెంకటేశ్వరరావు, అనకాపల్లి, కసింకోట ఎంఈఓలు దివాకర్, చిట్టిబాబు అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులను ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడ లయోలా కళాశాలలో ప్రదర్శిస్తారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు.


సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు క్యూ కట్టిన విద్యార్థినులు

గోవాడ సుగర్స్ ఫీల్డ్‌మ్యాన్ మృతి

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఫీల్డ్ మెన్‌గా పనిచేస్తున్న ప్రగడ సింహాచలం నాయుడు(59) గురువారం మృతి చెందారు. సింహాచలం నాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. సింహాచలం నాయుడు మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు, ఏవో పి.రమణమూర్తి, సిడిఓ కలిమిరామం, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవక సత్యారావు, గుర్తింపు యూనియన్ కార్యదర్శి కె.భాస్కర్ రావు, యూనియన్ నాయకులు రాముసాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు కార్మికులు మృతదేహానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మండల సమావేశంలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-సబ్బవరం

మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో సమస్యలు వెల్లువెత్తాయి. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపిపి బోకం సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎంపిపి బోకం సూర్యకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ వెంకట్‌ను ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు విద్యుత్ బిల్లుల్లో ప్రభుత్వం ఇస్తున్న రాయితీ అమలు చేయాలని, ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు అభివృద్ధి చేసిన భూములు అప్పగించాలని, వంగలిలో రింగు రోడ్డు కోసం కేటాయించిన స్థలాన్ని సర్వే చేయాలని, అమృతపురం వైఎస్సార్ కాలనీలో ఆక్రమణలు తొలగించాలని, ఎల్లప్పి కొండ నుండి ఎక్స్‌ప్రెస్ హైవేకు సబ్ కాంట్రాక్టర్ గ్రావెల్ అక్రమంగా తవ్వి తరలించడంపై చర్యలు తీసుకోవాలని తదితర సమస్యలపై జెడిపి వైస్ చైర్మన్, సభ్యులు విజ్ఞప్తి చేశారు. సబ్బవరం మండలంలో ఎక్కడా లేని విధంగా 172 వరకు కోర్టు కేసులు ఉండడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని డిటి వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్ నాయుడు, ఎఒ షేక్ బాబురావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి చిన అప్పల నాయుడు, సర్పంచ్‌లు వడ్డాది అప్పలరాజు, కర్రి నర్సింగరావు, ఆకుల శ్రీహేమ, మామిడి శంకరరావు, ఎంపిటిసిలు కర్రి అప్పారావు, గొర్లి కృష్ణ చైతన్య, జి.కనకరాజు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




మండల పరిషత్తు సమావేశాల్లో మాట్లాడుతున్న సబ్బవరం, పరవాడ ఎంపిపిలు సూర్యకుమారి, వెంకట పద్మలక్ష్మి

మొక్కుబడిగా మండల సమావేశం

పరవాడ : పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సమావేశం ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాసరావు అధ్యక్షతన మొక్కుబడిగా జరిగింది. ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ కారణంగా ఎటువంటి తీర్మానాలు చెయ్యలేదు. సభలో ప్రజా ప్రతినిధులు పలు సమస్యలు సభ దృష్టికి తీసుకుని రాగా, మండల అధికారులు వాటికి సూటిగా సమాధానాలు చెప్తూ సభను కొనసాగించారు. ముఖ్యంగా ఆర్ అండ్ బి రోడ్లు, జగనన్న హౌసింగ్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు, అసంపూర్తిగా వున్న అంగన్వాడీ భవనాలు విషయమై సభ్యులు ప్రశ్నలు అడిగారు. సమావేశానికి రెవెన్యూ అధికారులు గైర్హాజరు కావడంపై వివరణ కోరాలని ఎంపిడిఒ హేమ సుందరరావును ఎంపిపి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పైల సన్యాసిరాజు, వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, ఏఓ ఆశా, మండల వ్యవసాయ సలహామండలిఅధ్యక్షులు కోన రామరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- సబ్బవరం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి మిత్రులు రూ.1,41,100 మేరకు ఆర్థిక సహాయం అందజేశారు. గత నెల 31న వంగలి రోడ్డులో రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో అంతకాపల్లి పంచాయితీ శివారు ఒమ్మివాని పాలెం గ్రామానికి చెందిన కోన సరస్వతికి రెండు కాళ్ళు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మిత్రులు సబ్బవరంకు చెందిన చలుమూరి పుష్ప భర్త సురేష్, వారి మిత్రులు, 2001 ప్రభుత్వ హైస్కూల్ పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, మాడుగుల మండలానికి చెందిన బోయపాడు ఎరిణివేణి భర్త రవి, ఖండివరం మహేష్, దేవరపల్లి అనిత భర్త వెంకటరావు, వారి మిత్రులు కలిసి సేకరించిన రూ.1,41,100ను సరస్వతికి ఆర్థిక సహాయం కింద గురువారం అందజేశారు. ఆర్థిక సహాయ దాతలకు సరస్వతి తల్లిదండ్రులు దేముడు, అప్పలకొండ కృతజ్ఞతలు తెలిపారు.

అనురాధ నియామకంపై హర్షం

ప్రజాశక్తి-దేవరాపల్లి : వైసిపి మహిళా విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన జిల్లా పరిషత్తు స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్, కె.కోటపాడు జెడ్పిటిసి ఈర్లే అనురాధ ఎంపిక కావడం పట్ల వైసిపి మండల నాయకులు హర్షం తెలియజేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కుమార్తె అయిన అనురాధకు మరో కీలక పదవి దక్కడంపై ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, వైస్ ఎంపిపిలు బుల్లిలక్ష్మి, గంగాభవాని, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు నారాయణమ్మ, జెడ్పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, యువజన విభాగం మండల అధ్యక్షులు కర్రి సూరి నాయుడు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాచలం నాయుడు, స్థానిక వైసిపి నాయకులు లలితా నాయుడు తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

చీడికాడ : అనకాపల్లి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా కే.కోటపాడు జడ్పిటిసి ఈర్లీ అనురాధ నియామకం పట్ల వైసిపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చీడికాడ మండలంలో వరాహపురం గ్రామంలో సర్పంచ్ గొల్లవెల్లి చిన్నమ్ములు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు గలవెల్లి రాజబాబు ఆధ్వర్యంలో అనురాధను ఎంపిపి కురచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి లాలు శారద వరలక్ష్మి జానకిరామ్‌లు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధర్మిశెట్టి స్వాతి, పాల సంఘం అధ్యక్షులు ధర్మశెట్టి కొండబాబు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆధార్ నమోదు

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తాళ్ళపాలెం సచివాలయంలో ఆధార్ కార్డు నమోదు కార్యక్రమంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకట లక్ష్మి మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ, ఇతర పథకాలకు ఆధార్ కార్డు నమోదు కాక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ అప్‌డేట్‌ను ఒక్క రోజు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, మణికంఠ పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

సుగర్ ఫ్యాక్టరీని అమ్మే హక్కు అమర్‌నాథ్‌కు లేదు

ప్రజాశక్తి-అనకాపల్లి

చెరకు రైతుల మూలధనంతో నాటి ఎంపి వివి.రమణ కృషితో ఏర్పడిన తుమ్మపాల వివి.రమణ సహకార చక్కర కర్మాగారాన్ని అమ్మే హక్కు జిల్లాకు ఒక పరిశ్రమ కూడా తేలేని నేటి పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఎక్కడిదని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ప్రశ్నించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ అధికారంతో రైతుల ఆస్తులను లిక్విడ్ చేస్తారన్నారు. 13,500 మంది సభ్య రైతుల ఆస్తులను, వివి రమణ ఉన్నత ఆశయాలతో నిర్మించిన ఫ్యాక్టరీని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రైతుల అనుమతి లేకుండా తీసుకున్న నిర్ణయానికి విలువ ఉండదని, దీనిపై ఇప్పటికే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల పట్ల మంత్రికి అవగాహన లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం దొడ్డిదారిన తీసుకున్న నిర్ణయం కోర్టు ఉల్లంఘనకే దారితీస్తుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పిన మంత్రి నేడు లిక్విడ్ ఫైల్‌పై సంతకం చేయడం దారుణమన్నారు. జిల్లాకు పరిశ్రమలు వెల్లివెత్తుతాయని చెప్పిన మంత్రి జిల్లాలో ఉన్న మూడు సహకార చక్కెర కర్మాగారాలను మూసివేసి 50 వేల మంది రైతులను నట్టేట ముంచారని ఆరోపించారు. త్వరలోనే అఖిలపక్షాలతో మహాధర్నా నిర్వహించి లిక్విడేషన్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

సమీక్షా సమావేశానికి తరలిరండి

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఈనెల 26న కె.కోటపాడులో నిర్వహించనున్న వైసిపి మాడుగుల నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి మండలంలోని వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో గురువారం ఆయన పార్టీ మండల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26న మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈ సమీక్ష సమావేశానికి వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, నాయకులు కర్రి సూరి నాయుడు, సింహాచలం నాయుడు, చింతల సత్య వెంకటరమణ, ఉగ్రుకుల అప్పారావు, రొంగలి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రోటరీ ఇంటర్నేషనల్ 118వ వార్షికోత్సవం సందర్భంగా అనకాపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా రోటరీ క్లబ్ వ్యవస్థాపకులు పాల్ హారిస్‌కు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ చేశారు. రోటరీ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్ర చికిత్సలు చేశారు. వివిధ వృత్తి నైపుణ్యాలు శిక్షణ పొందిన వారికి ఒకేషనల్ అవార్డ్స్, పేద విద్యార్థులకు లక్ష రూపాయల స్కాలర్‌షిప్‌లు, జీవీఎంసీ గాంధీనగరం, భీమునిగుమ్మం ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పవన్ కుమార్, ప్రెసిడెంట్ సానా త్రినాధరావు, సెక్రటరీ రాజేష్ నాయుడు, ప్రోగ్రాం చైర్మన్ కడెంశెట్టి సతీష్, ఉప్పల వెంకట రాజు డాక్టర్ గ్రంధి శేషు కుమార్, పద్మనాభుని ప్రసాద్, బొగ్గారపు సర్వారావు, ఉప్పల రవిరాం జవహర్ పాల్గొన్నారు.

రాయితీపై సంపూర్ణ మిశ్రమ దాణా

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పాడి రైతులకు రాయితీపై సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ చేస్తున్నట్లు స్థానిక పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉషా కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులకు వర్షాభావం కారణంగా ఎండుగడ్డి కొరతను నివారించేందుకు ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో రైతుకు రెండు నెలలు సరిపడా 200 కిలోల నుండి 1800 కిలోలు మిశ్రమ దాణా అందిస్తామన్నారు. ఇంతవరకు మండలంలో 96,800 కిలోలు దాణా పంపిణీ చేశామన్నారు. 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

పుట్టగొడుగులు, తోటల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : చిన్న తరహా పుట్టగొడుగులు, గార్డెనింగ్ తోటల పెంపకంపై భారతీయ వ్యవసాయ నైపుణ్య మండలి, బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఉద్యానవన శాఖ అధికారి కిరణ్మయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల పుట్టగొడుగులు, ముచ్చుపుచిప్ప పుట్టగొడుగులు, గార్డెనింగ్‌లో యాజమాన్య పద్ధతులు, మామిడి, జీడి, జామ మొదలగు తోటల పెంపకంపై 27 రోజులు పాటు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్ అందిస్తారని తెలిపారు. ఈనెల 27 నుండి మార్చి 25వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, శిక్షణలో ఉచిత వసతి భోజన సదుపాయం కల్పిస్తారని పేర్కొన్నారు. 18 సంవత్సరాల నిండి 8వ తరగతి పాస్ అయిన వారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చుని తెలిపారు. ఆసక్తి గల వారు 7382700894 ఫోన్ నెంబర్లలో సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మృతిచెందిన గీత కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడి మరణించిన నక్కపల్లి మండలం ఉపమాక గ్రామానికి చెందిన దొంగల దాదమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ఏపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సంఘం సభ్యులైన దాదమ్మ మృతితో ఆయన కుటుంబం రోడ్డున పడిందని తెలిపారు. ప్రభుత్వ జీవో నెంబర్ 693 ప్రకారం మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వర కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి -మునగపాక రూరల్

స్థానిక మెయిన్ రోడ్డులో గల విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర ఆలయంలో గురువారం స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా మహాశివరాత్రి సంబరాలలో భాగంగా ఈ కళ్యాణం జరపడం ఆచారంగా వస్తోంది. ఇందులో పలువురు దంపతులు కూర్చొని కల్యాణ వేడుకలను జరుపుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన దేవాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

వైసిపి విభాగాలకు అధ్యక్షుల ఎన్నిక

ప్రజాశక్తి -పాయకరావుపేట:వైసిపి పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా పాయకరావుపేట పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, ప్రస్తుతం వైసీపీ పట్టణ అధ్యక్షుడిగా పని చేస్తున్న దగ్గపల్లి సాయిబాబాను నియమించారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

కోటవురట్ల:అనకాపల్లి జిల్లా వైసీపీ బీసీ సెల్ అధ్యక్షునిగా కోటవురట్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పైలా రమేష్‌ను నియమిస్తూ గురువారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, బీసీ సంఘ నాయకుల సమస్యలతో పాటు పార్టీ అభివృద్ధికి పని చేస్తానని తెలిపారు. గతంలో మండల వైసిపి అధ్యక్షునిగా దీర్ఘకాలం ఆయన పని చేశారు. జిల్లా పదవి దక్కడంతో పలు బీసీ సంఘాల నాయకులతో పాటు వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షులుగా హరిబాబు

ప్రజాశక్తి-నక్కపల్లి:వైసిపి విద్యార్థి వింగ్ విభాగం జిల్లా అధ్యక్షుడులుగా మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన పార్టీ యువ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి అప్పారావు (హరిబాబు) నియమితులయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రకటించిన జాబితాను పార్టీ కార్యాలయం విడుదల చేసింది. ఈ సందర్భంగా హరిబాబు విలేకరులతో



మాట్లాడారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం జగన్, మంత్రులు బూడి ముత్యాల నాయుడు, గుడివాడ అమర్నాథ్, టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఎంపీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే గొల్ల బాబురావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ చేపట్టిన నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూప రేఖలు పూర్తిగా మారి పోయాయన్నారు.

అప్పారావుకు సత్కారం

ప్రజాశక్తి-చీడికాడ: చీడికాడ మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఎర్ర అప్పారావును అనకాపల్లి జిల్లా రైతు సంఘం అధ్యక్షులుగా నియామకం పట్ల వైసీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అప్పారావు సేవలను గుర్తించి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు జిల్లా రైతు సంఘం అధ్యక్షులుగా నియమించడం హర్షించదగ్గ విషయమని నాయకులు, కార్యకర్తలు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం ఎర్ర అప్పారావుని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తన స్వగృహంలో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, పార్టీ అధ్యక్షులు రాజబాబు, యువజన అధ్యక్షుడు స్వామి నాయుడు, సీనియర్ నాయకులు సుంకర శ్రీను, డైరీ డైరెక్టర్ ఎస్.సూర్యానారాయణ, బూడి యువసేన కార్యకర్తలు పాల్గొన్నారు.




అప్పారావును సత్కరిస్తున్న బూడి ముత్యాలనాయుడు



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఉప విద్యాశాఖ అధికారి

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని యలమంచిలి ఉప విద్యా శాఖాధికారి యన్. ప్రేమకుమార్ సూచించారు. పదో తరగతి విద్యార్థులకు జిల్లా విద్యా శాఖ రూపొందించిన 50 రోజుల సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువును అభ్యసించాలన్నారు. సబ్జెక్టుల వారీగా సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో పాములవాక సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ సత్యవతి ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫర్ ఇండియా లింక్ వర్క్ స్కీం సభ్యులు ఎయిడ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి స్వామినాయుడు మాట్లాడుతూ, హెచ్ఐవి వ్యాధి నిర్ధారణకు ప్రతి ఒక్కరు పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. శారీరక వ్యాయామంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింకు సూపర్వైజర్ రమణ పాల్గొన్నారు.



ప్లాన్ అప్రూవల్ అందజేస్తున్న అధికారులు

ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం లో తలుపులమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, వైసిపి మండల యువజన అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు చొరవతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కృషి ఫలితంగా రూ.10 లక్షలు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి స్థలదానం చేసిన దాత గ్రామస్తులు పొట్ల శ్రీనివాసరావుకు మంజూరుకి సంబంధించి ప్రొసీడింగ్స్ కాపీని దేవాదాయ శాఖ అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలబాబు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అన్నవరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో అన్నవరం గ్రామంలో గురువారం 104 సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 70 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలని, వ్యాయామంతో పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యులు బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డోలిలో బాలింత తరలింపు

ప్రజాశక్తి-కొత్తకోట:బుధవారం రాత్రి బిడ్డను ప్రసవించి పసి బిడ్డకు వైద్య పరీక్షల కోసం గురువారం మూడు కిలో మీటర్లు దూరం బిడ్డను వడిలో పెట్టుకొని డోలిలో ప్రయాణం చేసిన బాలింత సంఘటన రావికమతం మండలం చీమలపాడు శివారు చలిసింగంలో చోటు చేసుకుంది. చలిసింగం గ్రామానికి చెందిన కాకర ఆనందరావు భార్య కాకర గంగ (26) గత రాత్రి ప్రసవించి ఒక బిడ్డకు జన్మను ఇచ్చింది. ఆ బిడ్డకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు కొత్తకోట పిహెచ్సికి తరలించాల్సి ఉంది. కొండపై నుంచి రోడ్డు మార్గం లేక పోవడంతో పాటు రవాణా సదుపాయం లేక బిడ్డను తరలించేందుకు నానా అవస్థలుపడ్డారు. దీనితో సహచర గ్రామస్తులు చొరవ తీసుకొని డోలిలో కొండ దిగువను గల సికాయిపాడు గ్రామానికి తరలించారు. అక్కడ నుంచి కొత్తకోట పిహెచ్సికి వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు. ఇదిలా ఉండగా చలిసింగం గ్రామానికి రోడ్డు సదుపాయం కోసం మంజూరైన కోటి 70 లక్షలు నిధులు ఏమయ్యాయని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, సిహెచ్ శంకరరావు తదితరులు ప్రశ్నించారు. రోడ్డు సదుపాయం కల్పించేందకు నిధులు మంజూరు చేసినా ఫారెస్టు అనుమతులు లేవని రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు కల్పించడం దారుణమన్నారు. గ్రామాన్ని తక్షణమే జిల్లా కలెక్టర్ సందర్శించి రోడ్డు, తాగు నీటి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



డోలిలో తరలిస్తున్న బంధువులు

స్కూల్‌లో మరమ్మతుకు నోచని బోరు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని అమలాపురం ఎంపిపి స్కూల్లో చేతిబోరు మరమ్మతుకు గురైంది. గురువారం పంచాయతీ మాజీ సర్పంచ్ రామలక్ష్మి భర్త సూరకాసుల గోవింద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాఠశాలలో చేతి బోరు మరమ్మతుకు గురై 5 నెలలు అవుతున్నా అధికారులు పట్టించు



కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతు న్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతు చేయించి వాడుకలోకి తీసుకురావాలని కోరారు.

సమస్యలపై జెడ్‌పిటిసి గిరిబాబు ప్రస్తావన

ప్రజాశక్తి-గొలుగొండ: విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో గొలుగొండ జడ్పిటిసి సుర్ల గిరిబాబు పలు సమస్యలను గురువారం ప్రస్తావించారు. మండలం కొత్తమల్లంపేట, ఏటిగైరంపేట జగనన్న కాలనీ లబ్ధిదారులకు లేఅవుట్ దూరంగా కేటాయించడంతో లబ్ధిదారులు సొంత గ్రామం విడిచి వెళ్లడానికి ఇష్ట పడలేదన్నారు.ఈ రెండు లేఅవుట్లలో కూడా ఇప్పటికీ నాన్ స్టార్టెడ్ స్టేజ్‌లో ఉన్నాయని, లబ్ధిదారుల కోరిక మేరకు వారు ఉంటున్న గ్రామంలోనే లేఅవుట్ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని కోరారు. మండలంలో అవసరం మేరకు ఆశా వర్కర్ల నియామకం జరపాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిబాబు

ఆర్ఐగా శివ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండల రెవెన్యూ ఆఫీసర్‌గా వి.శివ నియమితులయ్యారు. కోటవురట్ల మండలం నుండి నక్కపల్లి బదిలీపై వచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు. రెవిన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇక్కడ ఆర్ఐలుగా పని చేస్తున్న నర్సింగరావు, ప్రసాద్‌లు బదిలీ అయ్యారు.



గొర్రెలు, మేకలకు టీకాలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని పెద్దపేట, సింగరాజుపేట, ఎంకె.పట్నం ప్రాంతాలలో గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేసి, నట్టల నివారణ మందులు పంపిణీ చేశామని బుచ్చంపేట వ శు వై ద్యా ధి కా రి బి.అశ్విని తెలిపారు. గొర్రెల కాపరులు, రైతులతో పశు విజ్ఞానబడిన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీవాలకు ఫారుడు వ్యాధి రాకుండా టీకాలు వేసుకోవాలని, నట్టలు నివారణ మందులు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న వైద్యులు

రోడ్డుపై డ్రెయినేజీ మట్టి

ప్రజాశక్తి-మాకవరపాలెం: గత పది రోజులుగా రోడ్డుపై డ్రెయినేజి మట్టి కుప్పలు వేయడంతో స్థానికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాకవరపాలెం మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న మురుగునీటి కాలవలో మట్టిని బయటకు తీసి రోడ్డు పక్కన వేసి వదిలేశారు. అసలే రోడ్డు ఇరుకు కావడంతో మట్టి కుప్పలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు ఆనుకొని ఉన్న మట్టి కుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన వేసిన మట్టి

గంజాయి రవాణా చేస్తే చర్యలు

- సిఐ తాతారావు

ప్రజాశక్తి- చీడికాడ: మండలంలో అక్రమ మార్గాల్లో గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ తాతారావు హెచ్చరించారు. గురువారం ఆయన చీడికాడ పోలీస్ స్టేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, రవాణా చేసిన వారు ఎంతటి వారైనా క్షమించేదన్నారు. నాటు సారా నిర్మూలనకు మహిళా పోలీసులు వాలంటీర్ల సహకారం తో కృషి చేయాలన్నారు.మండలంలోని కొన్ని గ్రామాల్లో వాలంటీర్లు నాటుసారా విక్రయిస్తున్నట్లు తెలిసిందని, దీనిపై నిఘా పెడతామని తెలిపారు. పండగలు, జాతరలో అసాంఘిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదని, నిర్వాహకుపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-కోటవురట్ల: వాహనదారులు నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ నారాయణరావు సూచించారు. గురువారం ఆయన ప్రధాన రహదారిలో తంగేడు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు.వాహనాలకు తప్పనిసరిగా సకాలంలో ఇన్సూరెన్స్ చేయించాలని, గా హెల్మెట్ ధరించాలని సూచించారు.మితిమీరిన వేగంతో నడిపే వాహనాలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-చీడికాడ: మండలంలో ఖండివరం గ్రామానికి చెందిన టైలర్ కాపారపు శ్రీను, అతని భార్య, కూతురు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో జనసేన నాయకులు విజయ్, సంజీవ్‌లు బాధిత కుటుంబానికి రూ.23వేల నగదును హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ బోయిదాపు కిరణ్ చేతుల మీదుగా అందించారు.ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం జనసేన నాయకులు జి.వి.మూర్తి, హరిబాల, విజయ్, సంజీవ్, ఈశ్వర్, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ: ఈ నెల 24న 132 కెవి.బలిఘట్టం సబ్‌స్టేషన్ నుండి 33/11 కెవి గొలుగొండ 33/11 కేవి కేడిపేట సబ్ స్టేషన్స్ వరకు వచ్చే 33 కేవీ లైన్స్‌లో చెట్ల కొమ్మలను తొలగించేందుకు గొలుగొండ, కేడిపేట, చోద్యం, లింగంపేట, కొత్తమల్లంపేట, అమ్మపేట, జోగంపేట, సాలికమల్లవరం, శ్రీరామపురం, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, యర్ర వరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఎలక్ట్రికల్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటలకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరిం చాలన్నారు.

తట్టబందలో తీర్థం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో తట్టబంద గ్రామంలో షిరిడి సాయిబాబా తీర్థ మహోత్సవం సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలను నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

జోరుగా కోరెడ్ల రమాప్రభ ప్రచారం



మురళీనగర్‌లో ప్రచారం చేపడుతున్న రమాప్రభ

ప్రజాశక్తి -యంత్రాంగం


ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభ గెలుపును కోరుతూ గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

మాధవధార : మురళీనగర్, మాధవధార, కళింగనగర్ ప్రాంతాల్లో కోరెడ్ల రమాప్రభ గురువారం ప్రచారం నిర్వహించారు. మురళీనగర్‌లోని వాకర్స్ పార్క్, బృందావన్, ఎమ్మెన్నార్ పార్క్ ప్రాంతాల్లో వాకర్స్‌ను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీదేవి, బిటి.స్వామి, కె.సుధాకరరావు, ఎస్‌టివి.రమణమూర్తి, పి.రామచంద్రరావు, నాయుడుబాబు, ఈటి రాంబాబు, నాయనబాబు, పాపారావు, ఎస్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం : డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఇండిస్ట్రియల్ ఎస్టేట్‌లో వాకర్స్‌ను కలిసి తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు ఎస్.సోమేశ్వరరావు, జి.సూర్యచంద్రరావు, ఎస్.అప్పలరాజు, పి.వెంకటరావు, కృష్ణమూర్తి, ఎస్టేట్ సిఐటియు ప్రెసిడెంట్ ఒ.అప్పారావు, నాయకులు ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

తగరపువలస : డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ స్థానిక సిఐటియు నాయకులు ఎస్.అప్పలనాయుడు, డి.బాబాజీ చిట్టివలస ప్రాంతంలో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

కె.కోటపాడు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్, 250 ప్రజా సంఘాలు బలపరిచిన కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గురువారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు వనము సూర్యనారాయణ కె.కోటపాడులో ఎమ్మెల్సీ ఓటు ఉన్న వారి ఇంటికి వెళ్లి రమాప్రభకు ఓటు వేయాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి, పేదల పక్షాన నిలబడిన రమాప్రభ ఎమ్మెల్సీగా గెలుపొందినట్లయితే అసెంబ్లీలో ప్రజలు గళం వినిపిస్తారని తెలిపారు. విద్యాధికురాలైన డాక్టర్ రమాప్రభ సమస్యలపై మంచి అవగాహన ఉందని, అటువంటి వ్యక్తి శాసనమండలికి వెళ్లడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు.



కె.కోటపాడులో చేపడుతున్న ప్రచారం

మున్సిపల్ చైర్‌పర్సన్

ఆదిలక్ష్మి మాటల్లో ఆంతర్యమేంటో ?

కొంతమంది నేతలపై సోషల్ మీడియాలో వీడియోలు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి వైసిపిపై ధిక్కార ధోరణిలో ఉన్నట్టు ఆమె మాటల్లో తెలుస్తోంది. ఆమె మాట్లాడిన వీడియోలు సోషల్‌మీడియాలో చక్కెర్లు కొడుతున్నాయి. ఆ విషయాలు ఆమె మాటల్లో..మనిషిని అయితే గంభీరంగా ఉన్నాను కానీ మనసులంతా బరువెక్కి పోతుందని మాట్లాడటం పెద్ద దుమారమే లేపుతోంది. దీంతో, ప్రస్తుతం ఆమె పొలిటికల్ హాట్ టాపిక్ కు కేంద్ర బిందువుగా మారారు.అధికారులను సమన్వయం చేసుకుంటూ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ ఎమ్మెల్యే గణేష్ తప్ప కొంతమంది నాయకులు చేస్తున్న పనులు తనను ఇబ్బంది పెడుతున్నాయన్న ఆమె మాటలు మున్సిపాలిటీలో చక్కెర్లు కొడుతున్నాయి. తనపై వివక్ష చూపిస్తున్నారని ఆమె అన్న మాటలకు స్పష్టం లేని నిందలు వేయడంతో పార్టీ క్యాడర్లో అనేక రకాలైన అనుమానాలకు తావిస్తోంది. ఒప్పందం ప్రకారం పదవీకాలం పూర్తి కావస్తున్న తరుణంలో చైర్ పర్సన్ ఆదిలక్ష్మిలో మార్పు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వ్యక్తిగత ప్రయోజనం కోసం పార్టీ విధేయతను పక్కన పెట్టి ధిక్కారస్వరం వినిపిస్తున్నారా? లేక ఒప్పందం ప్రకారం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా అనేది తేలాల్సి ఉంది. తెర వెనుక నుండి ఎవరు మాట్లాడిస్తున్నారు. ఎందుకోసం మాట్లాడిస్తున్నారు అనే కోణంలో అధిష్టానం నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.



మరో కౌన్సిలర్ సుబ్బలక్ష్మి వ్యతిరేకించినప్పటికీ న్యాయం చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే గణేష్ ఆమెను శాంతింపచేసి చైర్ పర్సన్ పీఠంపై ఆదిలక్ష్మిని కూర్చోబెట్టారు. ప్రస్తుతం ఆమె మాట్లాడుతున్న వ్యాఖ్యలు తన రాజకీయ భవిష్యత్తుకు విఘాతం కలుగుతుందని పలువురు పేర్కొన్నారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం బంగారు భవిష్యత్తును చేతులారా పాడు చేసుకుంటున్నారా అనే కోణంలో పార్టీ క్యాడర్ గుసగుసలాడుకుంటున్నారు.

ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ పీఠం కోసం చేస్తున్న విశ్వ ప్రయత్నాలకు ఫలితం లేదనే విషయాన్ని కూడా చైర్ పర్సన్ ఆదిలక్ష్మి గమనించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా ఉండగా 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ఆదిలక్ష్మిని ఎన్నో రాజకీయ ఒడంబడికలు, ఒడిదుడుకుల మధ్య శాసనసభ్యులు ఉమాశంకర్ గణేష్ చైర్మన్ పీఠంపై కూర్చో బెట్టారు. నర్సీపట్నం మున్సిపాలిటీ ఎన్నికల్లో 28 మంది మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులకు గాను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి 14 మంది విజయం సాధించగా, టిడిపి నుండి 12 మంది, జనసేన పార్టీ నుండి ఒకరు, ఇండిపెండెంట్ గా ఒకరు కౌన్సిలర్లుగా గెలుపొందారు. ఇండిపెండెంట్ అభ్యర్థి వైసీపీలో కలిసి పోవడం గమనార్హం. అనంతరం ఎమ్మెల్యే నేతృత్వంలో చైర్ పర్సన్ ఎంపిక నిర్వహించారు. దీనిలో తెలుగుదేశం పార్టీ ఎత్తుగడలను చిత్తు చేసి మొదటి విడత రెండు సంవత్సరాల కాలం పాటు ఆదిలక్ష్మిని, రెండో విడత రెండు సంవత్సరాలు సుబ్బలక్ష్మి చైర్ పర్సన్ లుగా కొనసాగుతారని ఎమ్మెల్యే గణేష్ నిర్ణయం మేరకు ఆమె కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆదిలక్ష్మి మాటలతో ఆమెకు వరించే ఉన్నత స్థాయి పదవులపై ప్రభావం చూపుతుందని అనుచర గణంలో చర్చనీయాంసమైంది.

కాఫీ పిక్కల రా మెటీరియల్ తరలింపుతో..

ఆందోళనలో కాఫీ క్యూరింగ్ కూలీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : కాఫీ పిక్కల రా మెటీరియల్ తరలింపుతో తమకు పనులు దొరకవని నర్సీపట్నం కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న కూలీలు ఆందోళన చెందుతున్నారు. గురువారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా కాఫీ బోర్డు ఆధ్వర్యంలో కాఫీ పిక్కల గ్రేడింగ్ చేస్తున్నామని తెలిపారు. సుమారు 150 మంది కూలీలు పని చేస్తున్నామని, ప్రస్తుతం జిసిసి ఆధ్వర్యంలో ఈ క్యూరింగ్ జరుగుతుందన్నారు.కాఫీ పిక్కల రా మెటీరియల్ జిసిసి బయటకు తరలించకు పోతుందని, ఇక్కడ మెటీరియల్ లేక పోవడంతో తమకు పనులు లేకుండా పోతున్నాయని దీనిపై ఆధారపడి జీవిస్తున్న తమకు పనులు లేకపోతే ఏ విధంగా బతకాలని గోడును వెళ్ల బుచ్చారు. కాఫీ పిక్కల రా మెటీరియల్ ను లారీలపై తరలించుకుపోవడంతో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.సత్తిబాబు ఆధ్వర్యంలో అడ్డుకున్నారు.



పనులు చేస్తున్న మహిళా కూలీలు



మాట్లాడుతున్న సిఐటియు నేత సత్తిబాబు

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సత్తిబాబు మాట్లాడుతూ, సుమారు 40 సంవత్సరాలుగా ఇక్కడ కూలీలు పని చేస్తున్నారని, సంవత్సరంలో 9 నెలలు పని చేసి దీనిపైనే జీవిస్తున్నారని తెలిపారు. కాఫీ పిక్కలను బయటకు తరలించకుపోవడంతో కూలీలకు సంవత్సరంలో 40 రోజుల మాత్రమే పని జరుగు తుందని, దీంతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఏజెన్సీలో పండిన పంట నేరుగా ఇక్కడికి తీసుకువచ్చి క్యూరింగ్ చేసి గ్రేడింగ్ చేసి ఈ పప్పును బెంగళూరు వంటి ప్రాంతాలకు తరలించే వారని, ఇప్పుడు ఆ పనిని జిసిసి తీసుకొని కాఫీ పిక్కల గ్రేడింగ్ క్యూరింగ్ చేసేందుకు వేరొక ప్రాంతానికి తరలించకపోవడంతో ఇక్కడ పని చేస్తున్న కూలీలకు పనులు తగ్గిపోతున్నాయని తెలిపారు. ఒంటరి మహిళలు, దిక్కుమొక్కు లేని మహిళలు పని చేసుకుని జీవనోపాధిని సాగించుకుంటూ జీవిస్తున్నారని పేర్కొన్నారు. వీరి పొట్ట కొట్ట వద్దని కోరారు.